క్లుప్తంగా

బీమా చెక్కుల అందజేత



చెక్కు అందజేస్తున్న భాస్కర్‌రావు

మిర్యాలగూడ: చిట్యాల గ్రామ సర్పంచ్ బొమ్మరబోయిన నాగేంద్రమ్మ భర్త రామారావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. అదేవిధంగా దామరచర్ల మండల కేంద్రానికి చెందిన బైరం నరేష్ ఇటీవల విద్యుదాఘాతంతో మృతిచెందాడు. వీరికి బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వం ఉండడంతో బాధిత కుటుంబాలకు రూ.2లక్షల పార్టీ బీమా చెక్కులు మంజూరయ్యాయి. ఈ చెక్కులను బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు అందజేశారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కుందూరు వీరకోటిరెడ్డి, బాసాని గిరి తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

మిర్యాలగూడ అర్బన్: పద్మశాలి సంఘం నూతన క్యాలెండర్‌ను మిర్యాలగూడ పట్టణంలోని శ్రీలక్ష్మి కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షుడు పొట్టబత్తిని సత్యనారాయణ, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బొడ్డు గోవిందరావు, నాయకులు మిర్యాల వెంకటేశం, గంజి రామలింగం, వేణు గోపాల్, రవికుమార్, చిట్టిప్రోలు రమేష్, పట్టాభిరామయ్య, ప్రకాశ్, అశోక్, శివశంకర్, ప్రేమ్‌కుమార్, రామకృష్ణ పాల్గొన్నారు.

నెహ్రూ యువజన కేంద్రం అడ్వయిజరీ కమిటీ సభ్యుడిగా అభి

మిర్యాలగూడ టౌన్: నెహ్రూ యువ కేంద్రం నల్లగొండ జిల్లా యూత్ ప్రోగ్రాం అడ్వయిజరీ కమిటీ సభ్యుడిగా మిర్యాలగూడ పట్టణానికి చెందిన చిల్లంచర్ల అభి నియామకమయ్యారు. ఈమేరకు యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ కేంద్ర మంత్రి అనురాగ్‌సింగ్ ఠాకూర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

హాలియాకు చెందిన సామాజిక కార్యకర్త..

హాలియా: నెహ్రూ యువజన కేంద్ర సంఘం (ఎన్‌వైకేఎస్) జిల్లా అడ్వయిజరీ కమిటీ సభ్యుడిగా హాలియా మున్సిపాలిటీకి చెందిన బీజేపీ జిల్లా నాయకుడు చిట్టిమళ్ల శ్రీనివాస్ నియామకమయ్యారు. ఈమేరకు బుధవారం ఆయన స్థానికంగా మాట్లాడారు.

టైలర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

హాలియా: ది హాలియా టైలర్స్, ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం హాలియా పట్టణంలో సంఘం గౌరవ అధ్యక్షుడు ఆదిమూల ఆంజనేయులు ఆధ్వర్యంలో సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడిగా అయిటిపాముల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా మునిసి యాదగిరి, సహాయ కార్యదర్శిగా ఆయిటిపాముల రాజు, కోశాధికారిగా చేపూరి శ్రీనివాసాచారి, గౌరవ అధ్యక్షులుగా గడ్డం రమణయ్య, కొంగరి రవి, గౌరవ సలహాదారుగా ఆదిమూల ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులుగా హరిబాబు, చైతన్య నాయక్, గడ్డం కృష్ణ, శ్రీను, బ్రహ్మాచారి, శ్రీను నాయక్, వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు.

నిధులు కేటాయించాలి

మాడుగులపల్లి: మండలంలో పెండింగ్ పనుల పూర్తి, పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరుతూ జెడ్పీటీసీ పుల్లెంల సైదులు, పలువురు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు బుధవారం హైదరాబాద్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలో త్వరగా ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గడ్డం వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు కట్టా సిద్ధార్థరెడ్డి, పల్లె వెంకట్‌రెడ్డి, ఆరూరి నరేష్, శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.

వన్‌టౌన్ సీఐ బదిలీ

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని వన్ టౌన్ సీఐగా విధులు నిర్వహిస్తున్న రాఘవేందర్ సైఫాబాద్ సీఐగా బదిలీ అయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులు అందాయి.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్‌ఐ యాదయ్య

చింతపల్లి: చింతపల్లి ఎస్‌ఐగా యాదయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన సతీష్‌రెడ్డి సస్పెండ్ కావడంతో ఏఎస్‌ఐ అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. తాజాగా నల్ల గొండ వీఆర్ నుంచి యాదయ్య బుధవారం చింతపల్లి ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించారు.

అప్రమత్తంగా ఉండాలి

మాడుగులపల్లి : పశువులకు సీజనల్ వ్యాధులు సోకకుండా పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యాధికారి వినయ్‌కుమార్ అన్నారు. మాడుగులపల్లి మండలంలోని తోపుచర్ల గ్రామంలో బుధవారం పశు వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ యాదయ్య, ఉప సర్పంచ్ మణెమ్మ, ఎంపీటీసీ కనకారెడ్డి, గోపాలమిత్ర సూపర్‌వైజర్ శివారెడ్డి పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక రవాణా

- మూసీ, పాలేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలింపు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న పోలీసులు, అధికారులు



అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు

వేములపల్లి: మండలంలోని రావులపెంట గ్రామ పరిధిలోని మూసీ, కామేపల్లి గ్రామ పరిధిలోని పాలేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ ప్రభుత్వ నిధికి గండి కొడుతూ ఇసుక అక్రమ రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించడంతో ఇదే అదనుగా అక్రమార్కులు తమ వ్యాపారాన్ని సాగిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. రావులపెంట, కామేపల్లి గ్రామాలకు చెందిన సుమారు 15 నుంచి 20 ట్రాక్టర్ల వరకు అనుమతి లేకుండా రోజువారీగా ఇసుకను రవాణా చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. రావులపెంట గ్రామంలో పలు చోట్ల సీసీకెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ అడ్డదారిలో వాహనాలతో ఇసుక రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నారని పలువురు పేర్కొంటున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుక ట్రాక్టర్లు ఓవర్ స్పీడ్‌తో నడుపుతూ ప్రజలకు, బాటసారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. ఇసుకను మైనింగ్ శాఖ అధికారులు పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. అడపాదడపా తనిఖీలు చేయడం.. పట్టుకున్న ట్రాక్టర్ల నుంచి మామూళ్లు దండుకొని వదిలివేయడంతో ఇసుక అక్రమార్కులకు ఊతమిచ్చినట్లు అవుతుందని పలువురు పేర్కొంటున్నారు. రెవెన్యూ, మైనింగ్ అధికారులు పాలేరు, మూసీ వాగుల్లో గుర్తించిన ప్రదేశం నుంచి కాకుండా వాగులో అన్ని చోట్ల నుంచి ఇసుకను తరలిస్తుండడంతో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయని రైతులు వాపోతున్నారు.

మైనర్లతో వాహనాల డ్రైవింగ్..

అక్రమంగా ఇసుకను తరలించే దళారులు మైనర్లను ట్రాక్టర్ డ్రైవర్లుగా పెట్టుకుంటున్నారు. దీంతో వారు అజాగ్రత్తగా వాహనాలు నడపడంతో ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఇంత జరుగుతున్నా ఆర్టీఓ అధికారులు వాహనాలను తనిఖీ చేయకపోవడం, డ్రైవర్ల గుర్తింపు పత్రాలను పరిశీలించి కేసులు నమోదు చేయకపోవడంలో ఆంతర్యమేంటని పలువురు ఆరోపిస్తున్నారు.

పోలీసుల పర్యవేక్షణ లేదు



అధికార పార్టీ నాయకులు, అధికారుల అండదండలతోనే కొందరు అక్రమార్కులు ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. పోలీసుల పర్యవేక్షణ కూడా లేదు. పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఇసుక అక్రమ రవాణాతో భూగర్భజలాలు అడుగంటే ప్రమాదం ఉంది. అక్రమ ఇసుక దందాను అరికట్టకుంటే ఉద్యమం తప్పదు.ఇప్పటి వరకు ఎలాంటి అనుమతులు లేవు

– రెమదాల పరుశురాములు, మాజీ ఎంపీటీసీ

అనుమతి లేదు

ప్రభుత్వ పనులకు, ప్రైవేట్ పనులకైనా ఇసుక రవాణాకు ఎటువంటి అనుమతి ఇవ్వడం లేదు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటున్నాం.

– శ్రీనివాస్‌శర్మ, తహసీల్దార్

గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం

- ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి



కొరివేనిగూడెంలో పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ

హాలియా: గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. అనుముల మండలంలోని కొరివేనిగూడెంలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణం, సీసీ రోడ్డు పనులకు ఎంపీపీ పేర్ల సుమతీపురుషోత్తంతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకట్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ మున్నా, జిల్లా ముస్లిం మైనార్టీ నాయకులు అబ్దుల్ హలీం, అంజద్‌ఖాన్, మైనార్టీ మండల ప్రధాన కార్యదర్శి షేక్ జాని, హజారిగూడెం ఉప సర్పంచ్ జబీన్‌జలీల్ పాషా, నాయకులు చింతకాయల వెంకటేశ్వర్లు, నిమ్మల శ్రీకాంత్‌రెడ్డి, కొట్టాల శ్రీను, దైద కాశయ్య, సీత నాగరాజు, ఇరిగి కొండలు, శంకర్ తదితరులున్నారు.

డీఐఈఓను సస్పెండ్ చేయాలి



మాట్లాడుతున్న బుడిగ వెంకటేష్

డిండి: విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి దస్రూనాయక్‌పై విచారణ చేపట్టి, వెంటనే సస్పెండ్ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి బుడిగ వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం డిండి మండల కేంద్రంలో ఆ సంఘం మండల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విషయంలో డీఐఈఓ పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కనీస సౌకర్యాలు లేకుండానే ప్రైవేట్ కళాశాలల నిర్వహణకు అనుమతి ఇస్తున్నారని విమర్శించారు. ఉన్నతాధికారులు స్పందించకపోతే ఎస్‌ఎఫ్‌ఐ తరుపున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం మండల కార్యదర్శి దేవేందర్, సంతోష్, కుమార్, గణేష్, సన్నీ, బాబు, అంజి పాల్గొన్నారు.

ఎన్నికల హామీలన్నీ నెరవేరుస్తాం

- ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి



కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న జైవీర్‌రెడ్డి

గుర్రంపోడు: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలన్నింటినీ నెరవేరుస్తుందని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. గురువారం గుర్రంపోడు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ప్రజలకు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌లో భాగంగా రూ.లక్షతోపాటు, తులం బంగారం అందిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే ఆరు గ్యారంటీల్లో రెండు గ్యారంటీలను అమలు చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మంచికంటి వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ గాలి సరితారవికుమార్, సర్పంచ్ షేక్ మస్రత్ సయ్యద్‌మియా, ఎంపీటీసీ కుప్ప రాములు, ఎంపీడీఓ శ్రీపాద సుధాకర్, పార్టీ మండల అధ్యక్షుడు తగుళ్ల సర్వయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ సూదిని జగదీశ్వర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కంచర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు వెల్లపూరి కరుణాకర్ రావు, నాయకులు రాధాకృష్ణ, చనమల్ల జగదీశ్వర్‌రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మేడి వెంకన్న, కొత్త నాగరాజు, గణేష్ పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్టుకు అంతిమ వీడ్కోలు

- భారీగా తరలివచ్చిన జర్నలిస్టులు, బంధువులు, స్నేహితులు
- నివాళులర్పించిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు, ప్రముఖులు



జనార్దనశర్మ(ఫైల్)



సీనియర్ జర్నలిస్టు జనార్దనశర్మకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ టౌన్: ప్రముఖ సీనియర్ జర్నలిస్టు నందిభట్ల జనార్దనశర్మ(66) అస్వస్థతకు గురై మంగళవారం గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆయన మృతదేహాన్ని బుధవారం తెల్లవారుఝామున మిర్యాలగూడలోని వారి నివాసానికి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న స్నేహితులు, బంధువులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థల వారు తరలివచ్చారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నలమోతు భాస్కర్‌రావు, జూలకంటి రంగారెడ్డి, మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మోసిన్‌అలీ, కాంగ్రెస్ సీనియర్ నేత పగిడి రామలింగయ్య, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, కౌన్సిలర్ దేశిడి శేఖర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తమ్మడబోయిన అర్జున్, సీనియర్ జర్నలిస్టులు పున్నా కృష్ణమూర్తి, వాడపల్లి రమేష్, ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ నేతలు ప్రభాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కలిమెల నాగయ్యలు నివాళులర్పించారు. అనంతరం తాళ్లగడ్డ హిందూ శ్మశాన వాటిక వద్ద అంత్యక్రియలు నిర్వహించారు.

ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నివాళి

మిర్యాలగూడ పట్టణంలోని ఎన్‌ఎస్‌పీ క్యాంపు వద్ద ప్రెస్‌క్లబ్‌లో సీనియర్ జర్నలిస్టు నందిభట్ల జనార్దనశర్మ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. వారిలో వాడపల్లి రమేష్, ఖాజాహమీదుద్దీన్, మాధవరెడ్డి, మనోజ్, ఖాజానాజీముద్దీన్, అయ్యూబ్, నామిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఎండి అస్లాం తదితరులు పాల్గొన్నారు.







జనార్దనశర్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావు, జూలకంటి రంగారెడ్డి, ఐజేయూ నేతలు ప్రభాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి

నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

దేవరకొండ: దేవరకొండ నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యమని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. బుధవారం దేవరకొండ మండల పరిధిలోని మైనంపల్లి, మర్రిచెట్టుతండా, తాటికోల్, కొమ్మేపల్లి, ధర్మతండా, సూర్యతండా, పద్మట్‌పల్లి గ్రామపంచాయతీల్లో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం దేవరకొండ పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి కాచారం మీదుగా తాటికోల్ వరకు చేపట్టనున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జాన్‌యాదవ్, ఎంపీడీఓ శర్మ, ఎంపీటీసీ కొర్ర రాంసింగ్ గౌతమి, జూలూరి ఉత్తరమ్మ, దూదిపాల వేణుధర్‌రెడ్డి, రుక్మారెడ్డి, లోకసాని శ్రీధర్‌రెడ్డి, సర్పంచులు, ఉప సర్పంచులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. ఆల్ ఇండియా సమతా సైనిక్‌దళ్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం ఆయన దేవరకొండలోని క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా సమతా సైనిక్‌దళ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బుర్రి వెంకన్న, నియోజకవర్గ కన్వీనర్ వస్కుల రాజ్‌కుమార్, కంబాలపల్లి వెంకటయ్య, బరపటి వెంకటయ్య, నక్క వెంకటేష్, ధర్మపురం శ్రీను, అనిల్, రాజేష్, యాదగిరి, మల్లేష్, ఆంజనేయులు తదితరులున్నారు.

సంక్షిప్త సమాచారం

గద్దర్ ఆశయ సాధనకు కృషిచేయాలి

మిర్యాలగూడ టౌన్: ఆట, పాటల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చిన ప్రజాయుద్ధ నౌక గద్దర్ ఆశయ సాధనకు కృషి చేయాలని సామాజిక వేత్త డాక్టర్ జాడీ రాజు, టీటీఎఫ్ రాష్ట్ర నేత కస్తూరి ప్రభాకర్, తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య అన్నారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని ఎన్‌ఎస్‌పీ క్యాంపులో గల తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద గద్దర్ జయంతి నిర్వహించారు. అనంతరం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు రామయ్య, డేగ వీటి, దారం మల్లేష్ యాదవ్, దశరథనాయక్, సుదర్శన్, వెంకయ్య యాదవ్, సుధాకర్, హరికృష్ణ, గురువయ్య, నాగనాయక్, రాంబాబు తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గుర్రంపోడు: మండలంలోని జూనూతుల, కొప్పోలు సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. సబ్ స్టేషన్లలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

డిండి పశువుల సంత వేలం

డిండి: మండల కేంద్రంలో నూతనంగా నిర్వహించే పశువులు, మేకల సంతను నార్కట్‌పల్లి గ్రామానికి చెందిన దూదిమెట్ల వెంకటేష్ రూ.6 లక్షలకు దక్కించుకున్నట్లు గ్రామ కార్యదర్శి జంగయ్య తెలిపారు. బుధవారం డిండి గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన పశువుల సంత బహిరంగ వేలం పాటలో 21 మంది పాల్గొన్నారని పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీఓ సన్నీ అబ్రహం, సర్పంచ్ మేకల సాయమ్మ కాశన్న, ఉప సర్పంచ్ నూకం వెంకటేష్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు

అడవిదేవులపల్లి: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ విద్యాలయంలో బుధవారం నాగార్జునసాగర్ రాష్ట్రీయ స్వస్థ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్య బృందం ఆధ్వర్యంలో విద్యార్థినులకు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ గౌతమి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్బాస్ అలీ, నాగలక్ష్మి, పీఈటీ లలిత, అమరావతి ఫార్మసిస్టు నాగలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ లీలకుమారి తదితరులున్నారు.

దాతల సహకారం అభినందనీయం

వేములపల్లి: టెన్త్ విద్యార్థులకు ఉదయం అల్పాహారం, సాయంత్రం స్నాక్స్ అందిస్తున్న దాతల సహకారం అభినందనీయమని రావులపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. బుధవారం పాఠశాలలో ఆయన మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం, స్నాక్స్‌ను అందించేందుకు సర్పంచ్ దొంతిరెడ్డి వెంకట్‌రెడ్డి రూ.5వేలు, వార్డు మెంబర్ వంగాల సంజీవచారి రూ.5వేలు, ఉప సర్పంచ్ సైదులు రూ.3వేలు అందించడం గొప్ప విషయమన్నారు.

ఏఐఎస్‌ఎస్‌డీ కమిటీ నియామకం చెల్లదు

కొండమల్లేపల్లి : నల్లగొండ జిల్లా ఆల్ ఇండియా సమత సైనిక్ దళ్ (ఏఐఎస్‌ఎస్‌డీ) కమిటీ నియామకం చెల్లదని ఆల్ ఇండియా సమత సైనిక్ దళ్ నల్లగొండ జిల్లా ఉపాధ్యక్షుడు యేకుల సురేష్ అన్నారు. బుధవారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారి, జిల్లా నాయకులు కూర శ్రీకాంత్, చిట్యాల గోపాల్, యేకుల అంబేడ్కర్, రమావత్ బాలు, రాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత

నాగార్జునసాగర్: రోడ్డు భద్రత అందరి బాధ్యత అని నాగార్జునసాగర్ సీఐ బీసన్న అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని బుధవారం నందికొండలోని హిల్‌కాలనీ నుంచి పైలాన్ వరకు ప్రధాన రహదారిలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు రమేశ్, సురేష్, సంపత్, నాట్కో ఉద్యోగులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

మిర్యాలగూడ అర్బన్: ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రయాణికులకు సహకరించాలని ట్రాఫిక్ ఎస్‌ఐ మోహన్ అన్నారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని వీధి వ్యాపారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.

రికార్డులు స్వాధీనం

త్రిపురారం: అభివృద్ధి పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని డీపీఎల్‌ఓ ప్రతాప్ నాయక్ హెచ్చరించారు. త్రిపురారం మండలంలోని పెద్దదేవులపల్లి, నీలాయిగూడెం గ్రామాల్లో పంచాయతీ అభివృద్ధి పనుల్లో అవకతవకలకు పాల్పడ్డారని గ్రామాలకు చెందిన కొందరు యువత కలెక్టరేట్‌లో ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈమేరకు బుధవారం డీపీఎల్‌ఓ ప్రతాప్‌నాయక్ పెద్దదేవులపల్లి, నీలాయిగూడెం గ్రామాల్లో గ్రామ పంచాయతీ అభివృద్ధి పనులపై విచారణ జరిపి రికార్డులను స్వాధీనం చేసుకున్నారు.

ఎంపీ టికెట్ ఇవ్వాలి

నిడమనూరు: నల్లగొండ లోక్‌సభ బీజేపీ టికెట్ తనకే ఇవ్వాలని ఫామ్ మెకనైజేషన్ స్టేట్ సెల్ కన్వీనర్ దప్పిలి కోటేశ్వరరెడ్డి కోరారు. బుధవారం నిడమనూరులో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ పార్టీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నానని తెలిపారు. పార్టీలో ఎంతో సీనియర్ అయిన తనకు నల్లగొండ లోక్‌సభ నుంచి టికెట్ ఇస్తే గెలుస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు.

'సాక్షి' ఇండియా స్పెల్‌బీ ఫైనల్‌కు ఎంపికైన విద్యార్థి



విద్యార్థి హర్షతో ప్రిన్సిపాల్ ఖలీమ్

మిర్యాలగూడ టౌన్: ఇటీవల నిర్వహించిన 'సాక్షి' ఇండియా స్పెల్ బీ పోటీలో మిర్యాలగూడ పట్టణంలోని శాంతినగర్‌లో గల వర్డ్ అండ్ డీడ్ ప్రాథమిక పాఠశాల విద్యార్థి జి.హర్ష హైదరాబాద్‌లో జరిగే ఫైనల్స్‌కు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎండీ ఖలీమ్ బుధవారం తెలిపారు. ప్రతి ఒక్కరిలో పోటీతత్వం ఉంటేనే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలుగుతామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి హర్షను పాఠశాల యాజమాన్యంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం తెస్తా



ఉపాధ్యాయ సంఘాల నాయకులతో మల్లన్న

నాగార్జునసాగర్: పూర్తిగా ధ్వంసమైన ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకువస్తానని తీన్మార్ మల్లన్న అన్నారు. బుధవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నందికొండలోని బీసీ గురుకుల విద్యాలయం, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, పైలాన్‌లోని ఆదర్శ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిశారు. కార్యక్రమంలో శర్మ, సైదులు, వీరబాబు, సైదమ్మ, మంగ, శ్రావణి, బుజ్జిబాబు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘాలను కలిసిన మల్లన్న

హాలియా: త్వరలో జరగనున్న ఉమ్మడి వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో తీన్మార్ మల్లన్న బుధవారం హాలియా జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ సంఘాల నాయకులను కలిశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయ సంఘాల నాయకులు తనకు సహకరించాలని కోరారు. అనంతరం స్థానిక టైం స్కూల్‌కు చేరుకుని, ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. అనంతరం స్కూల్ డైరెక్టర్ మంద నరేందర్‌రెడ్డి తీన్మార్ మల్లన్నను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హాలియా జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు గుండా కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు వెంకటరాంరెడ్డి, షర్ఫోద్దీన్, టైం స్కూల్ ప్రిన్సిపాల్ కోటిరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

కోదండరాం ప్రమాణస్వీకారం అడ్డుకోవడం సరికాదు



నిరసన తెలుపుతున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్: ప్రొఫెసర్ కోదండరాం ఎమ్మెల్సీ ప్రమాణస్వీకారాన్ని అడ్డుకోవడం సరికాదని తెలంగాణ జన సమితి మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ లావూరి క్రాంతికుమార్ అన్నారు. బుధవారం టీజేఎస్, టీజేఎస్ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి కోదండరాంపై కేసీఆర్ కుట్రలు చేయడం కొత్తేమీ కాదన్నారు. కేసీఆర్ పాలనలో అనేక రకాల దాడులకు పాల్పడిన విషయం తెలంగాణ ప్రజలకు తెలుసన్నారు. పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా కోదండరాం పోటీ చేస్తే ఓడించేందుకు రూ.వందల కోట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. నేడు పెద్దల సభకు వెళ్లకుండా అడ్డుకునేందుకు కోర్టులో కేసు వేయించి ప్రమాణస్వీకారాన్ని అడ్డుకున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సైదా, లచ్చిరాం నాయక్, రవీందర్‌నాయక్, కేతావత్ మంగు, మంగ్యానాయక్‌లతో పాటు పలువురు ప్రజా సంఘాల నాయకులు తదితరులున్నారు.

సర్పంచ్‌లకు సన్మానం



ఆగామోత్కూర్ సర్పంచ్ అఫ్జల్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

మిర్యాలగూడ: ఐదేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న మిర్యాలగూడ మండలానికి చెందిన ఆయా గ్రామాల సర్పంచ్‌లను బుధవారం మిర్యాలగూడలోని రైతువేదికలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి ఎంపీపీ నూకల సరళహన్మంతరెడ్డితో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెలిశెట్టి రామకృష్ణ, పీఆర్ ఏఈ ఆదినారాయణ, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు వెంకటరమణచౌదరి, ధనావత్ శంకర్‌నాయక్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మాడుగులపల్లి మండలంలో..

మాడుగులపల్లి: సర్పంచ్‌ల పదవీకాలం పూర్తయిన నేపథ్యంలో మాడుగులపల్లి మండలంలోని పలు గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు బుధవారం వారికి వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఆగామోత్కూర్, ఇందుగుల, పోరెడ్డిగూడెంలో సర్పంచులు అఫ్జల్, కన్నయ్య, కోటిరెడ్డిని సత్కరించారు.




మిర్యాలగూడ: సర్పంచ్‌లను సన్మానిస్తున్న తిప్పన విజయసింహారెడ్డి

ఎడమ కాలువకు నీటిని విడుదల చేయాలి

మిర్యాలగూడ టౌన్: నాగార్జునసాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేయాలని కోరుతూ బుధవారం సచివాలయంలో నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాకు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఎడమ కాలువకు నీరు రాకపోవడంతో భూగర్భ జలాలు పూర్తిగా ఎండిపోయాయని పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీసీ సంక్షేమ సంఘం నేతలు తాటికొండ విక్రమ్, శ్యామ్, ఇంద్ర తదితరులున్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న సీడీపీఓ పద్మావతి

పెద్దవూర: ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ గంధం పద్మావతి అన్నారు. బుధవారం పెద్దవూర మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యాలయంలో నిర్వహించిన బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. చిన్న పిల్లలను ఇబ్బందులకు గురిచేస్తే 1098, మహిళలపై గృహ హింస, ఏదైనా ప్రమాదంలో ఉంటే 100 టోల్‌ఫ్రీ నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ బాషిపాక కమలాభాయి, పాఠశాల ఎస్‌ఓ జ్యోత్స్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.